
# ఈ జన్మకది చాలు

- జయంతి కావేరిమణి



రాఘవరావు, శాంతమ్మ ఇంట్లో వుండలేక బయటికొచ్చేశారు. రాఘవరావు వీల్‌ఛైర్‌లో రెక్కలు విరిగిన పక్షిలా కుమిలిపోతున్నాడు. శాంతమ్మ, కరిగిపోతున్న తన కలలకి కన్నీళ్లు తోడిచ్చి, తను ఒంటరై నిశీథంలోకి చూస్తున్నట్టు కూర్చుంది.

'అమ్మా' గేటు చప్పుడు చేసింది తమ మామిడి చెట్టు క్రింద బ్రతుకును వెళ్లదీస్తున్న అమ్మాయి.

శాంతమ్మ తన చూపును అటువైపు మరల్చింది.

'లోన సామాన్లు పెట్టుకుంటానమ్మా' అంది ఆ అమ్మాయి.

అలాగే అన్నట్లు తల ఊపింది శాంతమ్మ. ఆ అమ్మాయి బట్టలు, వంటపాత్రలు లోన పెట్టేసుకుని వెళ్లిపోయింది.

ఆ సన్నివేశం శాంతమ్మకి గతాన్ని గుర్తుచేసింది.

పదిహేనేళ్ల క్రితం యామిని ఎక్కడ్నుంచో ఒక మామిడి మొక్క తెచ్చి కాంపౌండ్ దగ్గర వేస్తోంది.

'యామినీ... ఆ మొక్కను అలా కాంపౌండ్ దగ్గర కాకుండా ఈ లాన్లో ఓ మూలగా వేయచ్చు కదే' అన్నాను.

'అమ్మా... ఇక్కడ వేస్తే మనకి ఫలసాయమే ఇస్తుంది. అదే కాంపౌండ్ దగ్గర వేస్తే, మనకి ఫలసాయంతోపాటు దారినపోయే బాటసారులకి చక్కటి నీడనిచ్చి సేదతీరుస్తుంది కూడా' అంది చిన్నపిల్లయినా విశాల హృదయంతో. అది కోరుకున్నట్లే ఆ చెట్టు విశాలంగా పెరిగి చక్కని నీడని, చల్లదనాన్ని ప్రసాదిస్తూ ఎందరినో సేదతీరుస్తోంది.

అలా యామిని జ్ఞప్తికి రాగానే శాంతమ్మ కళ్లు

చెమ్మగిల్లాయి.

యామిని అసలు పేరు మంగమ్మ. ఎన్నడూ పెదవి దాటని చిరునవ్వుతో కుందనపు బొమ్మలా వుండేది. ఆమె శాంతమ్మ బంధువు కాదు, పక్కింట్లో పనిచేసే పనిపిల్ల. యామిని పురిటికందుగా వున్నప్పుడే తల్లి చనిపోయింది. కాస్త జ్ఞానం తెలిసేసరికి తండ్రి పోయాడు. ఆ తర్వాత ఆమెను పక్కింటి వాళ్లు తెచ్చుకొని ఇంటి పన్లన్నీ చేయించుకుంటూ, పసిపిల్ల అనైనా చూడకుండా రాసి రంపాన పెట్టేవారు. ఆలనా పాలనా లేని యామినికి ఓసారి కలరా సోకింది. వెంటనే ఆ ఇంటివాళ్లు దాన్ని నడిరోడ్డు మీద పడేసి చేతులు దులుపుకున్నారు.

ఆఫీసు నుండి వస్తున్న శాంతమ్మ చావుబ్రతుకుల మధ్య నున్న యామిని పరిస్థితి గమనించి, వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్లి ప్రాణభిక్ష పెట్టింది. ఆ తర్వాత ఆమెను ఇంటికి తీసుకువచ్చి తన పిల్లలతోపాటు పెంచింది. ఏనాడూ దానిని పనిపిల్లగా చూడలేదు. తన కడుపున పుట్టిన బిడ్డగానే సాకింది. తన పిల్లలతోబాటు స్కూలుకు పంపింది. అప్పుడే మంగమ్మ పేరుకు బదులు తనకిష్టమైన యామిని పేరు పెట్టుకొంది దానికి. చిన్నపిల్లయినా ఇంటి పనంతా ఒక్కర్తే చక్కగా చేసేది. శాంతమ్మ తరచుగా ఆస్తమాతో బాధపడేది. అటువంటప్పుడు కనీసం కంటిపై ఒక్క కునుకైనా వాలనీయకుండా జాగ్రత్తపడి, శాంతమ్మకి ఎన్నో ఉపచారాలు చేసి పెట్టేది.

యామినిని ఇంటికి తెచ్చుకొనేటప్పటికి రాఘవరావు ఆస్ట్రేలియా వెళ్లి రెండేళ్లే అయింది. ఆరు సంవత్సరాల కాంట్రాక్టు మీద అక్కడ ఉద్యోగం చేయడానికి వెళ్లాడు. మధ్యలో ఓసారి వచ్చినపుడు యామినిని దత్తత చేసుకుందామని శాంతమ్మ అతనితో చెప్పింది. దానికి అతడు అంగీకరించకపోగా, ఇంట్లోంచి పంపేయమని చెప్పి వెళ్లిపోయాడు.

రాఘవరావు కాంట్రాక్టు పూర్తికాగానే వచ్చి సొంత గూటిలోనే సెటిలైపోయాడు. ఒక రోజున యామిని దత్తత విషయాన్ని శాంతమ్మ మళ్లీ రాఘవరావు దగ్గర ప్రస్తావించేసరికి– 'దాన్ని ఏనాడో ఇంట్లోంచి పంపేయమంటే, ఇక్కడే ఎందుకు ఉంచావ'ంటూ శాంతమ్మపై విరుచుకు పడ్డాడు.

అంతే కాకుండా, 'నీకు పిల్లలు లేరనా... దాన్ని పెంచుకోవాలను కుంటున్నావు? ఇద్దరు మగ పిల్లలున్నారు చాలరా? ఇలా నెల తప్పగానే వెళ్లి స్కానింగ్‌లో ఆడోమగో తెల్సుకుని 'ఆడ' అయితే అప్పటికప్పుడే అబార్షన్ చేయించుకుంటున్న రోజులివి. వారంతా ఉత్త పిచ్చి వెధవలనా? ఆడపిల్లల్ని జాగ్రత్తగా పెంచుకురావటం, పెళ్లి చెయ్యటం, తర్వాత పురుళ్లు వగైరాలు ఎంతో టెన్షన్, శ్రమ, ఎంతో ఖర్చుతో కూడుకున్నవని నీకు తెలియదా? కంటే ఖర్మమనుకోవాలి గాని, పెంచుకొని అటువంటి ఖర్మాన్ని తెచ్చిపెట్టుకోవాలా? నేలని పోయిందాన్ని నెత్తికి రాసుకోవడం అంటే ఇదే. రేపే దీన్ని ఏ బోర్డింగ్‌లోనో జాయిన్ చేసేసి దాని ఖర్మాన దాన్ని వదిలెయ్' అంటూ వీరంగం వేశాడు.

శాంతమ్మ మారుమాట్లాడలేకపోయింది. ఆ రాత్రంతా ఒకటే ఏడుపు. మరునటి రోజు శాంతమ్మని బలవంతాన బయల్దేరదీసి, యామినిని క్రిస్టియన్ మిషనరీ బోర్డింగ్ స్కూల్లో అనాథ అని చెప్పి జాయిన్ చేశాడు. ఆమె అనాథగావటం, చదువులో మంచి ప్రతిభ కనపరచటం వల్ల మిషనరీ యాజమాన్యం ఆమెను పై చదువులకై కేరళ పంపించారు. అక్కడ కూడా చదువు పూర్తికాగానే అదే స్కూల్లో ఆమెను టీచర్‌గా నియమించుకున్నారు.

యామిని ఆ ఇంట్లో తిరుగాడినంత కాలం ఆ ఇంట్లో నిత్యం వసంతం కొలువై వుండేది. ఇప్పుడు ఆమె లేకపోవడం వల్ల ఇల్లంతా బోసిపోయి పాడువడిన దేవాలయంలా తయారైంది.

యామినిని దూరం చేయడం శాంతమ్మ భరించలేకపోయింది. అప్పుడప్పుడు ఆ స్కూలుకి వెళ్లి పుస్తకాలు, బట్టలు వగైరాలన్నీ ఇస్తూ వస్తుండేది. యామిని రజస్వల అయినప్పుడు బోర్డింగ్ స్కూల్లో గ్రాండ్‌గా ఫంక్షన్ ఏర్పాటుచేసి, తన కూతురికి ఏమీ చేసుకోలేకపోయానన్న బాధ నుండి కొంతలో కొంత ఉపశమనం పొందింది.

యామిని కేరళ వెళ్లిపోయినా శాంతమ్మకి తరచూ ఉత్తరాలు వ్రాస్తుండేది. ఈ విషయం తెల్సిన రాఘవరావు, తమతో సంబంధం

తెంచుకోమని హెచ్చరిస్తూ యామినికి ఘాటుగా ఉత్తరం వ్రాసేశాడు. దాంతో ఆమె శాంతమ్మకి ఉత్తరాలు వ్రాయలేకపోయింది. కాని తన ఫ్రెండ్ సాయితేజకి ఉత్తరాలు వ్రాస్తూ శాంతమ్మ ఆరోగ్యం, ఇంటి విషయాల గురించి తెల్సుకుంటూ ఉండేది.

యామిని జ్ఞాపకాలు తెరలుతెరలుగా రావటంతో చెమ్మగిల్లిన శాంతమ్మ కళ్లు భళ్లున వర్షించాయి.

'ఆ రోజు యామినిని దత్తత చేసుకొని ఇంట్లో ఉంచుకుందాం అంటే విన్నారా? ఇటువంటి కష్టకాలంలో ఆదరించి అక్కున చేర్చుకునేదే ఆడపిల్ల! దాన్ని మనకు కాకుండా చేసుకున్నాం. అందుకే ఇలా బాధపడవల్సి వస్తోంది' అంది శాంతమ్మ.

రాఘవరావు ఏమీ మాట్లాడలేక మిన్నకుండిపోయాడు.

లోపల గదిలో రాఘవరావు పెద్దకొడుకు సుధీర్, చిన్నకొడుకు శ్రీకర్ ఇద్దరూ ఏకధాటిగా ఆలోచిస్తున్నా వారి ముందున్న సమస్యకు పరిష్కారం అగమ్యగోచరంగా వుంది.

'ఒరేయ్ తమ్ముడూ... నాకా సెలవులు అయిపోతున్నాయి. ఇప్పుడు వెళితేనే కువైట్‌లో వచ్చే నెల ప్రారంభం కానున్న ఒపెక్ ప్రాంతీయ కార్యాలయంలో మంచి పోస్టు సంపాదించుకోవచ్చు. అందులో కనీసం పది సంవత్సరాలు పన్జేశానంటే, ఇండియాకి కోట్లతో తిరిగి రావచ్చు. అమ్మానాన్నల కోసం ఇక్కడుండిపోతే అడుక్కు తినాల్సిందే. పోనీ వీళ్లిద్దర్నీ తీసుకుపోదామంటే, తను, నేను ఉద్యోగానికి పోతే ఈ పేషెంట్లని చూసేదెవరు?' సుధీర్.

'మాదీ అలాంటి ప్రాబ్లమే బావగారూ... మలేషియాలో మేమున్నది ఎనిమిదో అంతస్తులో. ఈ ముసలాళ్లకు ప్రతీ దానికీ ఇబ్బందే అవుతుంది. అదీగాక, ఇక్కడి నుండి వెళ్లిన వెంటనే నేను కూడా ఉద్యోగంలో చేరుతున్నాను. అప్పుడు వీరి పరిస్థితి?' అంది శ్రీకర్ భార్య సువర్ణ.

'ఏమండోయ్ చెప్పిందే చెప్పుకుని ఎంతసేపని కాలయాపన చేస్తారు. ఎనిమిది గంటలైంది తెల్సా! ఏదో నిర్ణయం తీసుకొని ఇక్కడ ఏర్పాట్లేదో చూసేస్తే, మనం మధ్యాహ్నం బయల్దేరడానికి వీలవుతుంది' అంటూ అందరికీ కాఫీ అందించింది సుమిత్ర, సుధీర్ భార్య.

'పరిష్కారం కన్పడకనే కదే, ఇలా కూర్చుని జుత్తులు పీక్కుంటున్నాం' అన్నాడు సుధీర్.

'ఇదేమైనా కాశ్మీర్ సమస్యా, లేక శ్రీలంక తమిళుల సమస్యా? ఓ పట్టాన పరిష్కారం కాకపోవడానికి. మనం మళ్లీ తిరిగొచ్చేవరకు వీళ్లిద్దరినీ ఓల్డేజ్ హోమ్‌లో ఉంచండి. ఈ ఇంటిని అద్దెకిచ్చేయమనండి. ఆ అద్దె వాళ్ల ఖర్చులకు సరిపోతుంది' అంది సుమిత్ర.

'భేషుగ్గా ఉందక్కా... నీ ఆలోచన' మెచ్చుకొంది సువర్ణ.

'ఏరా తమ్ముడూ... నువ్వేమంటావ్?' అడిగాడు సుధీర్.

'నీ ఇష్టమే నా ఇష్టం' అన్నాడు వాడు.

'ఇక్కడ ఓల్డేజ్ హోమ్‌లు వున్నాయా, ఇప్పటికిప్పుడు ఎలా తెలుస్తుంది?' సంశయం వ్యక్తం చేశాడు సుధీర్.

'అదేంటండీ, అది కూడా ఒక సమస్యేనా? మీ బాల్య స్నేహితుడు సాయితేజని కలుసుకోండి. పూర్తి సమాచారం లభిస్తుంది' అంది సుమిత్ర.

తమ చవట బుర్రలను తిట్టుకుంటూ సాయితేజని కలుసుకోవడానికి అన్నదమ్ములిద్దరూ

## అంతర్మథనం

వరకట్నం నేరం
అయినా తప్పలేదు బేరం
అరికట్టలేవా ఈ ఘోరం?

అస్పృశ్యత నేరం
అయినా తప్పలేదు దూరం
ఏదీ దీనికి పరిహారం?

కుల వివక్ష నేరం
అయినా అడుగడుగునా ప్రత్యక్షం
దీనికి లేదా పరిష్కారం??

అంతర్మథనం జరగనిదే
ఆశించిన మార్పు రాదు
మూసుకున్న మది తలుపులు తెరచి
సౌజన్యపు విత్తులు చల్లనిదే
అనుకున్న లక్ష్యం నెరవేరదు!

– వి.ఎస్.ఆర్.మౌళి

బయల్దేరారు.

ఆ రోజు సెలవు కావటంతో సాయితేజ ఇంట్లోనే ఉన్నాడు. వీళ్లని సాదరంగా ఆహ్వానించాడు. చాలాకాలం తర్వాత కలుసుకున్నారేమో... చదువులు, ఉద్యోగ విషయాలు, విదేశాలు, సంపాదనల గురించి చాలాసేపు ముచ్చటించుకున్నారు.

'నాన్నగారు, అమ్మగారు ఎలా వున్నారు?' అడిగాడు సాయితేజ.

'నాన్న గారికి ఇరవై రోజుల క్రితం యాక్సిడెంట్ జరిగింది. ఆ షాక్‌కి తట్టుకోలేని అమ్మకి గుండెపోటు వచ్చింది. అందుకే ఇరవై రోజులు సెలవుపై వచ్చాం. వాళ్లిద్దరూ బాగా కోలుకోవడంతో ఈ రోజే అంతా బయల్దేరుతున్నాం' అన్నాడు సుధీర్.

'అయ్యో... ఎంత ఘోరం జరిగింది' అని సాయితేజ అంటూండగానే,

'ఇక్కడేమైనా డాక్టర్ చెకప్‌మెంట్, మంచి ఫెసిలిటీస్ గల ఓల్డేజ్ హోమ్‌లు ఏమైనా వున్నాయా?' అడిగాడు సుధీర్.

సాయితేజకి పరిస్థితి అర్థమయింది. మా ఆఫీస్ ప్రక్కనే ఒకటుందని చెప్పాడు.

'ఇంత మహానగరానికి ఒకటేనా?' ఆశ్చర్యం వ్యక్తం చేశాడు శ్రీకర్.

'కడుపున పుట్టిన పిల్లలు వార్ధక్యంతో గాని, అనారోగ్యంతో గాని వున్న తల్లిదండ్రులను చెంతనే వుంచుకొని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నప్పుడు వీటి అవసరం ఎక్కడైనా ఎందుకుంటుంది?' అడిగాడు సాయితేజ.

'నీకే ఇబ్బందులూ లేవు కాబట్టి నువ్వలా మాట్లాడుతున్నావ్' అన్నాడు సుధీర్.

'నాకు ఇబ్బందులు లేక కాదు, మీలా విదేశాలు పోలేక కాదు. నా తోడు, నీడ కోరుకుంటున్న తల్లిదండ్రులను వారి ఖర్మానికి వారిని వదిలేసి, సంపాదనే ధ్యేయంగా నాకు వెళ్లాలనిపించలేదు. ఈ ఓల్డేజ్ హోమ్‌లు ఎవరికి? ఎవరూ లేని అనాథలకి. అంతేగానీ అందరూ వున్నవారికి కాదే! ఇంకా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వార్ధక్యంలో వున్నవారికి, దూరంగా వున్న తమ కన్నపిల్లలపై దిగులు, ఒంటరితనం లాంటి వాటిని ఈ హోమ్‌లు తీర్చలేవు. కన్నపిల్లలు పంపే డబ్బుతో తగ్గించనూ లేవు. వారికి కన్నపిల్లలు అందించే ప్రేమ, చూపించే వాత్సల్యం, కురిపించే ఆప్యాయత, పంచి యిచ్చే అనురాగం ముఖ్యం. స్నేహితుడిని కాబట్టి చెప్తున్నాను. ఇప్పటికైనా నీ ఆలోచన విరమించుకో' అన్నాడు ఆవేశంగా సాయితేజ.

సుధీర్, శ్రీకర్ మొహాలు మాడిపోయాయి. తాము చేస్తున్నది తప్పని తమకి తెలుస్తోంది. కాని డబ్బు మీద మోజు, అధికార వ్యామోహం వాళ్ల విజ్ఞతని అణగదొక్కేస్తుంటే, మరో ఆలోచనకి తావివ్వకుండా అక్కడనుంచి బయల్దేరి, ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లి ఫార్మాలిటీస్ పూర్తిచేసి ఇంటిముఖం పట్టారు.

సాయితేజ ఈ విషయాలన్నింటినీ పూస గుచ్చినట్టు యామినికి ఫోన్లో చెప్పాడు వెనువెంటనే.

కొడుకులు, కోడళ్లు, మనవళ్లతో సందడిగా పండగ వాతావరణాన్ని తలబోయవలసిన ఇల్లు శవం కదిలిన ఇల్లులా విషాదం అలుముకుంది. భోజనాలయ్యాయి. కోడళ్లిద్దరూ బట్టలు వగైరా సర్దుకుని ప్రయాణానికి సిద్ధమయ్యారు. అలానే రాఘవరావు, శాంతమ్మల బట్టలు కూడా సర్దిపెట్టారు. టాక్సీ ఇంటిముందు ఆగింది.

'అమ్మా... ట్రైన్‌కి టైం అవుతోంది. మేం బయల్దేరుతున్నాం. అలానే మీరు కూడా బయల్దేరితే...' అంటూ ఆపేశాడు సుధీర్.

శాంతమ్మ, రాఘవరావు ముఖాలు దివ్యంగా వెలిగిపోయాయి.

'ఎక్కడికిరా... కువైటా? మలేషియానా?' అన్నారిద్దరూ ఏకకంఠంతో.

'అబ్బే, అదికాదు...' అని నసుగుతున్నాడు సుధీర్.

'చెప్పండి, అలా నసుగుతారేం? అత్తయ్యా... మీ పెద్దబ్బాయి గాని, చిన్నబ్బాయి గాని ఇప్పుడు వాళ్లున్న పరిస్థితులలో ఇక్కడుండే అవకాశం ఏమాత్రం లేదు. అలాగని మాతో మిమ్మల్ని తీసుకుపోదామంటే దేశం కాని దేశంలో మీరు మసలటం కష్టం. అందుకే మీకే ఇబ్బందీ కలగకుండా ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిస్తాం. అక్కడ ఏ ఇబ్బందీ వుండదు. ఒంటరులమయ్యామన్న ఫీలింగ్ అసలే వుండదు. మనమంతా మళ్లీ ఈ

ఇంటికొచ్చేవరకు దీన్ని అద్దెకిచ్చేయండి' క్లుప్తంగా చెప్పింది సుమిత్ర.

'అమ్మా... మమ్మల్నేం శపించకు. ఈ నిర్ణయం తీసుకున్నది మీ మీద ప్రేమ, అభిమానం లేక కాదు, పరిస్థితులు మాకు అనుకూలించక. మేం ఇక్కడ వుండిపోతే గొర్రెతోక బెత్తెడు లాంటి జీతాలతో జీవితాంతం బ్రతుకీడ్చవలసిందే. అదే అక్కడుంటే కోట్లు సంపాదించుకోవచ్చు. ఆలోచించమ్మా, ఇంత కష్టపడి చదివించారు కదా, అదంతా బూడిదలో పోసిన పన్నీరు కావల్సిందేనా? మన అభిమానాలు, అప్యాయతలు మన అభివృద్ధి నిరోధకాలుగా మారకూడదమ్మా. చెప్పు... నీకిష్టం లేకపోతే ఇక్కడే వుండి గానుగెద్దులా బ్రతికేస్తాం' అంటూ భుజాన వ్రేలాడుతున్న బ్యాగ్‌ను కిందకు దించాడు సుధీర్.

'మీరు ఎక్కడున్నా సుఖసంతోషాలతో ఉండాలని, పేరు ప్రతిష్ఠలు తెచ్చుకోవాలన్నదే మా కోరిక. వెళ్లి రండి' అంది శాంతమ్మ కట్టలు తెంచుకొని వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

'మీరు కూడా వచ్చేయండి. ఓల్డేజ్ హోమ్ దగ్గర డ్రాప్ చేసి అలా వెళ్లిపోతాం' అన్నారు వాళ్లు.

'లేదర్రా... తెల్సిన ఊరేగా, మేం తర్వాత వెళ్తాం. మీరు బయల్దేరండి' అంటూ పలు జాగ్రత్తలు చెప్పి సాగనంపింది శాంతమ్మ.

కారు పొగ విరజిమ్ముకుంటూ ముందుకు దూసుకుపోయింది.

అంతవరకు అణచిపెట్టుకున్న దుఃఖం పరవళ్లు త్రొక్కుతూ వచ్చేసింది. రాఘవరావు, శాంతమ్మలు భోరున ఏడ్చారు గుండెలు బ్రద్దలయ్యేలా.

రాఘవరావు, శాంతమ్మలు ఆ లంకంత కొంపలో ఒక్క రోజైనా ఉండలేకపోయారు. వారి మనసులు చాలా బలహీనమైపోయాయి. ఎవరి సహాయమైనా లేందే బ్రతుకు వెళ్లదీయటం కష్టమనిపిస్తోంది వారికి. మాటామంతీ కోసం వారు తపించిపోవటం ప్రారంభించారు. ఆప్యాయత గల పలకరింపు కోసం అర్రులు చాచడం ప్రారంభమైంది. అందుకే మరుసటి రోజు సాయంత్రం ఓల్డేజ్ హోమ్‌కి వెళ్లిపోవటానికి సిద్ధమయ్యారు.

ఇంటిముందు ఆటో ఆగింది. ఆటోలోంచి యామిని, సాయితేజ దిగారు.

'ఎవరది?' అడిగాడు రాఘవరావు.

కొద్ది సేపు పరిశీలనగా చూసి, 'మన యామినండీ' అంటూ పరుగున వెళ్లి వాటేసుకుంది శాంతమ్మ.

'అమ్మా... నేను మీ కోసమే వచ్చేశానమ్మా. ఇక ఇక్కడే ఉండిపోతానమ్మా' అంది ఎన్నాళ్లుగానో అణిచిపెట్టుకున్న అభిమానం ఎద లోయల్లోంచి లావాలా ఎగసిపడుతుండగా.

రాఘవరావు, శాంతమ్మల ముఖాల్లో ఆనందోత్సాహాలు తాండవిస్తుండటంతో ఆనందబాష్పాలు జలజలా రాలుతున్నాయి.

'బాబుగారూ, మీ ఆరోగ్యం ఎలా వుంది?' అడిగింది యామిని దగ్గరగా వచ్చి.

'బాబుగారూ ఏంటమ్మా? ఇకమీదట నువ్వు మమ్మల్ని అమ్మా, నాన్నా అని ఏకవచనంలో పిలు. నిన్ను కనే భాగ్యానికి వేం ఎలాగూ నోచుకోకపోయినా, కనీసం పెంచుకునే అదృష్టాన్ని కూడా కాలరాసుకున్న దురదృష్టవంతుడిని నేను. మా కాలిన చేతుల్ని చూసి ఆకులు నవ్వుకుంటున్నాయని, ఇప్పుడు మా తప్పు సరిదిద్దుకోవడానికి, ఏ అచ్చటా ముచ్చటా తీర్చలేని ఈ స్థితిలో నిన్ను మా దగ్గర వుంచుకుని, నీ భవిష్యత్తును నాశనం చేసి ఆ పాపాన్ని కూడా నేను మూటగట్టుకోలేనమ్మా. దయచేసి మా గురించి ఆలోచించకుండా నువ్వు వెళ్తున్న దారిలోనే నీ ప్రయాణం కొనసాగించుకోమ్మా. కానీ, తరచూ వచ్చిపోతూ ఈ అమ్మానాన్నలకు కాస్తంత ఊరడింపు కలిగించమ్మా. ఈ జన్మకది చాలు' అన్నాడు రాఘవరావు జరిగిన సంఘటనకి బాధ్యత వహిస్తూ.

'అంకుల్... బాధపడకండి. మీ అంగీకారంతో యామినిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. అప్పుడు మన రెండు కుటుంబాలు కలిసి ఒకేచోట ఏ ఇబ్బందీ లేకుండా ఉండొచ్చు' అన్నాడు సాయితేజ.

యామిని సిగ్గుతో తలవంచుకుంది. శాంతమ్మ ఆమెను గుండెలకు హత్తుకొని, అమ్మలోని ప్రేమామృతాన్ని వరాల జల్లుగా కురిపిస్తోంది. వారి హృదయాలు విహంగాలై ఆనంద లోకాల్లో విహరించడం ప్రారంభించాయి. ☆